# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 19 ఫిబ్రవరి 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ కాలపరిమితి పొడిగింపు

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఎస్సీ వర్గీకరణపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ కాలపరిమితిని ప్రభుత్వం మార్చి 10వరకు పొడిగించింది. రాష్ట్రంలో ఎస్సీల వర్గీకరణపై అధ్యయనం చేసి, సిఫారసులు చేసేందుకు వీలుగా ఏర్పాటు చేసిన ఈ కమిషన్ నవంబరు 11న బాధ్యతలు చేపట్టింది. సమగ్ర అధ్యయనం చేసి 60 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆ కమిషన్‌ను కోరింది. జనవరి 10న అరవై రోజుల గడువు ముగియడం తో జనవరి 11 నుంచి ఫిబ్రవరి 10 వరకు పొడిగించారు. అనంతరం కమిషన్ ఇటీవలే నివేదిక సమర్పిం చింది. అయితే ఎస్సీ వర్గీకరణకు చట్టరూపం రావాల్సి ఉండటంతోపాటు, పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పున్ణపరిశీలించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కమిషన్ కాలపరిమితిని మార్చి 10 వరకు మరో సారి పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## సైబర్ నేరాల అడ్డుకట్టకు
# రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరం

- 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌ను ప్రచారం చేయాలి
- ట్రెజరీ పదానికి అర్థమే మారిపోయింది
- సైబర్ నేరాలను నియంత్రించడంలో తెలంగాణను దేశానికే రోల్ మాడల్‌గా తీర్చిదిద్దుతాం
- సైబర్ నేరాలతో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి
- సైబర్ సెక్యూరిటీ కంక్లేవ్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి




**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరమని, తొలి ప్రయత్నంగా అందుకు అవసరమైన ఒక వారధిని నిర్మించేందుకు చొరవ తీసుకున్నందుకు తెలంగాణ సైబర్ క్రైమ్ విభాగాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. సమాజానికి ఒక సవాలుగా మారిన సైబర్ నేరాలను నియంత్రించడంలో తెలంగాణను దేశానికే రోల్ మాడల్‌గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రిచెప్పారు. ఆకాశమే హద్దుగా కొత్త రూపాలు సంతరించుకుంటున్న సైబర్ నేరాలను అరికట్టడంలో పరిమితమైన విధానాలతో కేవలం ఒక రాష్ట్రం చేసే ప్రయత్నాలు ఫలితాలను ఇవ్వవని, రాష్ట్రాలన్నీ సమన్వయంతో దేశం ఒక యూనిట్‌గా పనిచేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు.తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో హెచ్ఐసీసీలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి “సైబర్ సెక్యూరిటీ కాంక్లేవ్ –2025” ను ముఖ్యమంత్రి గారు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారితో కలిసి ప్రారంభించారు. “బాధితులకు రక్షణ కవచంగా సైబర్ భద్రత – డిజిటల్ భవిష్యత్తు” (#SHIELD2025) అన్న అంశంపై జరుగుతున్న ఈ సదస్సు నుంచి ముఖ్యమంత్రి కొత్తగా రూపుదిద్దుకున్న సెక్యూరిటీ ఆపరేషన్స్ సెంటర్ , సైబర్ ఫ్యూజన్ సెంటర్ లను విర్చువల్‌గా ప్రారంభించారు.

అనంతరం మాట్లాడుతూ, సైబర్ నేరాలను నియంత్రించడంలో జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉందని కేంద్ర ప్రభుత్వం కితాబిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే, మారుతున్న సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరమని, తొలి ప్రయత్నంగా అందుకు అవసరమైన ఒక వారధిని నిర్మించేందుకు చొరవ తీసుకున్నందుకు తెలంగాణ సైబర్ క్రైమ్ విభాగాన్ని ముఖ్యమంత్రి అభినందించారు.సైబర్ క్రిమినల్స్ ఇటీవలి కాలంలో దాదాపు 22 వేల కోట్ల రూపాయలను కాజేసినట్టు అంచనాలు వచ్చాయని, ప్రజల జీవన స్థితిగతులను, ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ఇలాంటి ప్రమాదకరమైన పరిణామాలను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. దీంతో పాటు ఫేక్‌న్యూస్, సోషల్ మీడియా ద్వారా తప్పుడు సమాచార వ్యాప్తి సమాజానికి చేటు కలిగిస్తున్నాయని అన్నారు.

సమాజంలో కొంతమంది జరగని నేరాలు జరిగినట్టు, జరగని దాడులు జరిగినట్టు లేదా మరో కారణం చేతనైనా డీప్ ఫేక్ న్యూస్ వ్యాప్తి చేస్తున్నారని, ఆర్థిక నేరాలతో పాటు ఇలాంటి వాటన్నింటినీ నియంత్రించాల్సిన అవసరం ఉందని చెప్పారు. “సైబర్ నేరాలను అరికట్టడానికి ఐటీ సంస్థలు, నిపుణులతో కలిసి తెలంగాణ నిబద్ధతతో పనిచేస్తోంది. ఈ నేరాలను అరికట్టడంలో 24 గంటలూ సైబర్ హెల్ప్ లైన్ 1930 పనిచేస్తుంది. ఈ విషయాన్ని అందరికీ చేరవేయాలి. గతేడాది తెలంగాణలో కొత్తగా 7 సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను ప్రారంభించాం. ఇదే క్రమంలో సైబర్ నేరాలతో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి” అని ముఖ్యమంత్రి గారు చెప్పారు.

“ఆకాశమే హద్దుగా ప్రతి క్షణం ఏదో ఒక సైబర్ నేరం జరుగుతుందని, సైబర్ నేరం ఎక్కడి నుంచి జరిగింది. నేరం చేసిందెవరని గుర్తించడం, వారిని పట్టుకోవడం, శిక్షించడం వంటి అనేక సవాళ్లతో పాటు అసలు నేరం జరక్కుండా నిరోధించాల్సిన బాధ్యత కూడా పోలీసులపైనే ఉంది. సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి ఆయా రాష్ట్రాలతో సమన్వయం సాధించడానికి దేశంలో ఒక కనెక్టింగ్ బ్రిడ్జ్‌లా ఈ సదస్సు ద్వారా ప్రయత్నించడం అభినందనీయం. సైబర్ నేరాలను నియంత్రించడంలో తెలంగాణ ఈ దేశానికే రోల్ మాడల్‌గా నిలబడుతుంది. ఆదర్శంగా ఉంటుంది” అని పేర్కొన్నారు. హోం శాఖ కార్యదర్శి రవిగుప్తా , రాష్ట్ర డీజీపీ జితేందర్ , తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ జనరల్ శిఖా గోయల్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతీ వివిధ రాష్ట్రాలకు చెందిన పోలీసు ఉన్నతాధికారులు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు ఈ కాంక్లేవ్ లో పాల్గొన్నారు.



## వైద్య, ఆరోగ్య శాఖకు అధిక నిధులు కేటాయిస్తాం

- రాజీవ్ ఆరోగ్యశ్రీకి సమృద్ధిగా నిధులు కేటాయిస్తాం
- వైద్య, ఆరోగ్య శాఖ ప్రీ బడ్జెట్ సమావేశం లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మంత్రి దామోదర రాజనర్సింహ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

పేద, మధ్యతరగతి వర్గాలు అత్యధికంగా ఆధారపడే వైద్య, ఆరోగ్య శాఖకు నిధుల కేటాయింపులో అత్యంత ప్రాధాన్యత ఇస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన వైద్య, ఆరోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రీ బడ్జెట్ సమావేశంలో సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు పలు సూచనలు చేశారు. గత దశాబ్ద కాలంగా డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ, మెడికల్ ఎడ్యుకేషన్ విభాగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రులు అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రభుత్వం లో ఈ మూడు విభాగాలకు ప్రాధాన్యత ఇచ్చి రాబోయే రోజుల్లో బలోపేతం చేస్తామని తెలిపారు. డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ విభాగాలను ఆధునికీకరణ చేస్తాం అన్నారు.

రాజీవ్ ఆరోగ్యశ్రీ కి రానున్న బడ్జెట్లో సమృద్ధిగా నిధులు కేటాయించి, పేద, మధ్యతరగతి వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం అన్నారు. రానున్న ఏడాది కాలంలో రాష్ట్రంలో వైద్య కళాశాల భవనాలు, ఆసుపత్రుల నిర్మాణం పనులు పూర్తవుతాయని మంత్రులు తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాలను పెద్ద సంఖ్యలో వినియోగించుకునేందుకు అధికారులు కృషి చేయాలని మంత్రులు ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ ప్లాంటోరియంలు నిర్మించే ఆలోచనలో ఉన్నట్టు మంత్రులు తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టియాన చొంగతా, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రటరీ హరిత తదితరులు పాల్గొన్నారు.

## హబ్ గోయస్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

స్టార్టప్‌ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ఒప్పందం చేసుకుంది. అంతర్జాతీయ స్టార్టప్ భాగస్వామ్యానికి టీ హబ్ , బ్రెజిల్‌లోని గోయస్ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే హబ్ గోయస్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి , ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు వాచ్ఐసీసీలో హబ్ గోయస్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అనంతరం టీ హబ్ పౌండేషన్ సీఈవో సుజిత్ జాగిర్దార్ గారు, బ్రెజిల్ దేశ గోయస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రెటరీ జోస్ ప్రెడెరికో లైరా నెట్టో గారు ఒప్పందంపై సంతకాలు చేశారు.

ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో అవకాశాలు, అలాగే బ్రెజిల్ స్టార్టప్‌లకు మన రాష్ట్రంలో అవకాశాలు లభిస్తాయి. ప్రధానంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, అగ్రి–టెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ రంగాల్లో పరస్పర సహకారం పంచుకుంటాయి. మార్కెట్ యాక్సెస్‌తో పాటు కెపాసిటీ బిల్డింగ్ ఇంక్యుబేషన్, సాంకేతిక భాగస్వామ్యం, పెట్టుబడుల అవకాశాల మెరుగుదల వంటి కీలక అంశాలపై టీ–హబ్ , హబ్ గోయస్ కలిసి పని చేస్తాయి. రెండు దేశాల స్టార్టప్ ఎకో సిస్టమ్‌ల మధ్య సంబంధాలను ఈ ఒప్పందం బలోపేతం చేయనుంది.



## భారత ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా జ్ఞానేశ్ కుమార్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారత ఎన్నికల సంఘం నూతన సారథిగా జ్ఞానేశ్ కుమార్, ఎలక్షన్ కమిషనర్‌గా వివేక్ జోషి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం రాత్రి రెండు గెజిట్ నోటిఫికేషన్లు వేర్వేరుగా విడుదలయ్యాయి. ఎన్నికల కమిషనర్ల నియామకంపై తీసుకొచ్చిన కొత్త చట్టం ప్రకారం నియమితులైన తొలి సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ నిలిచారు. ఎన్నికల ప్రధాన కమిషనర్‌గా ఉన్న రాజీవ్ కుమార్ పదవీకాలం ఫిబ్రవరి 18తో ముగియనుండటం వల్ల నూతన సీఈసీని ఎంపిక చేశారు. అంతకుముందు ఇదే అంశంపై సమావేశమైన ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ తదుపరి సీఈసీ పేరును ఎంపిక చేసి రాష్ట్రపతికి సిఫార్సు చేసింది. రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఆ వెంటనే అధికారిక ప్రకటనలు విడుదలయ్యాయి. ఎన్నికల కమిషనర్ల నియామకాలకు సంబంధించి 2023లో తీసుకొచ్చిన చట్టం ప్రకారం చేపట్టిన తొలి ఎంపికలు ఇవి. ప్రస్తుతం ఎన్నికల కమిషనర్?గా జ్ఞానేశ్ సీఈసీగా బాధ్యతలు చేపట్టనున్నందున ఆయన స్థానంలో ఈసీగా వివేక్ జోషిని ఎంపిక చేశారు. సుఖ్‌బీర్ సింగ్ సంధు ఇప్పటికే మరో ఈసీగా ఉన్నారు.



## భూ భారతి స్ఫూర్తితోనే విధి విధానాలు

- తెలంగాణ ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా భూభారతి చట్టం చేశాం
- రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- విధివిధానాలపై కలెక్టర్లతో వర్క్ షాప్

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ప్రజాస్వామ్యయుతంగా అసెంబ్లీలో డ్రాఫ్ట్ బిల్లు పెట్టి ఆ తర్వాత మేధావులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు సూచనలు తీసుకొని దేశానికి ఆదర్శంగా ఉండేలా భూ భారతి ఆర్వోఆర్ 2025 చట్టాన్ని తీసుకు వచ్చామని అదే స్ఫూర్తితో ఈ చట్టానికి సంబంధించిన విధివిధానాలను రూపొందిస్తున్నామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు.తెలంగాణ ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలన్న ఆశయంతో, విస్తృత స్థాయిలో అభిప్రాయాలను సేకరించి గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూభారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు.

భూభారతి చట్టం రూపకల్పనకు ఎంత కష్టపడ్డామో ఈ చట్టానికి సంబంధించిన విధివిధానాలను తయారు చేయడానికి అదే స్థాయిలో కసరత్తు చేయాలని అధికారులను కోరారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేలా చిన్న చిన్న తప్పులకు ఆస్కారం లేకుండా పకడ్బందీగా విధివిధానాలను రూపొందించాలని అధికారులకు సూచించారు. భూభారతి చట్టానికి సంబంధించి విధివిధానాలను రూపొందించడంపై హైదరాబాద్ లోని ఎం.సీ.ఆర్.హెచ్.ఆర్.డి.లో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న వర్క్ షాప్ లో మొదటి రోజు మంగళవారం నాడు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ “ఎలాంటి విధి విధానాలు తయారు చేయకుండానే 2020 ఆర్వోఆర్ చట్టాన్ని ఆనాటి ప్రభుత్వం అమలులోకి తీసుకురావడంతో ఎదురైన ప్రతికూల పరిస్థితులు మన కళ్లముందే కనిపిస్తున్నాయి. ఆనాటి పాలకులు గొప్పగా చెప్పుకున్న ధరణిలో అన్ని లొసుగులు, లోపాలే. నిబంధనల రూపకల్పన లేకుండానే అమలులోకి తీసుకువచ్చిన 2020 ఆర్ఓఆర్ చట్టం వల్లే లక్షలాది మంది రైతులు రోడ్డున పడ్డారు. చట్టం తీసుకువచ్చి మూడు సంవత్సరాలు గడచినా కూడా ఆనాటి ప్రభుత్వం విధివిధానాలను రూపొందించలేదు. సచివాలయంలో కూర్చొని రూల్స్ ఫ్రేమ్ చేయకుండా విస్తృత స్థాయిలో అధికారులు, మేధావులు, అనుభవజ్ఞుల సలహాలు సూచనలు తీసుకొని అందరి అభిప్రాయాలను క్రోడీకరించి పకడ్బందీగా భూ భారతి విధివిధానాలు తయారు చేస్తున్నాం. వీలైనంత త్వరగా భూభారతి చట్టానికి సంబంధించిన విధివిధానాలను తయారుచేసి చట్టాన్ని అమలులోకి తీసుకువస్తాం. కొత్త సమస్యలు రాకుండా ఉన్న సమస్యలు పరిష్కారం అయ్యేలా రైతులకు ప్రయోజనం కలిగేలా, అధికారులు తప్పుచేయడానికి ఆస్కారం లేకుండా విధివిధానాలను రూపొందిస్తున్నాం.

తెలంగాణలో నూతన రెవెన్యూ చట్టం భూభారతి భూ పరిపాలనలో పెను మార్పులను మిగితా 2వ పేజీలో

## 420 పాలనలో 430 మంది రైతులు ఆత్మహత్య



- 56 మంది గురుకుల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలి
- రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ గురించి తప్ప స్టేట్ గురించి ఫికర్ లేదు.
- బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఆమనగల్ రైతు నిరసన దీక్ష

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కాంగ్రెస్ 420 పాలనలో 430 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. “మొన్న తలుపులు ఎత్తుకుపోయిండు.. నిన్న స్టార్టర్లు ఎత్తుకుపోయిండు.. ఇక రేపు మీ పుస్తెలతాడు కూడా రేవంత్ రెడ్డి ఎత్తుకుపోతడు.దొంగ హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచిస్తున్న రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పే పని కల్వకుర్తి ప్రాంతం నుంచే మొదలుపెట్టాలి” అని అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గం, ఆమనగల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ రైతు మహాధర్నా కార్యక్రమంలో పాల్గొని ఆయన ప్రసంగించారు.

“కొడంగల్ లో రేవంత్ రెడ్డి ఎవరికి న్యాయం చేయలేదు. అక్కడ ఎవరికి రైతుబంధు రాలేదు. రుణమాఫీ కాలేదు. కళ్యాణ లక్ష్మి మిగితా 2వ పేజీలో

## కుంభమేళాలో 55 కోట్ల మంది భక్తుల పుణ్యస్నానాలు

- ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటన

వివరాలు 2వ పేజీలో




## జేఎన్టీయూ హైదరాబాద్ వీసీగా టీకేకే రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ) హైదరాబాద్ ఉపకులపతి (వీసీ)గా ప్రొఫెసర్ టి కిషెన్‌కుమార్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఇటీవల జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ కోసం సెర్చ్ కమిటీ సమావేశమైన విషయం తెలిసిందే. ముగ్గురు ప్రొఫెసర్ల జాబితాను ప్రభుత్వానికి పంపించింది. వాటిని పరిశీలించి గవర్నర్ ఆమోదానికి ప్రభుత్వం పంపించింది. ప్రభుత్వ ప్రతిప్రాదనలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పరిశీలించి టి కిషెన్‌కుమార్‌రెడ్డిని జేఎన్టీయూ హైదరాబాద్ వీసీగా ఆమోదించారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన మూడేండ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారని తెలిపారు. మంగళవారమే ఆయన జేఎన్టీయూ హైదరాబాద్ వీసీగా బాధ్యతలను స్వీకరించారు. ఆయ నకు ఉన్నత విద్యామండలి చైర్మెన్, జేఎన్టీయూ హైదరాబాద్ ఇన్‌చార్జ్ వీసీ వి బాలకిష్టారెడ్డి, రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుతో పాటు అధ్యాపకులు, ఇతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## హైకోర్టులో కేసు వాదిస్తూ గుండెపోటుతో లాయర్ మృతి..



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర హైకోర్టులో విషాదం చోటుచేసుకుంది. కేసు వాదిస్తూ ఓ న్యాయవాది గుండెపోటుతో మరణించారు. వివరాల్లోకి వెళితే.. పసునూరు వేణుగోపాల రావు న్యాయ వాది. మంగళవారం హైకోర్టులో ఓ కేసుకు సంబంధించి న్యాయమూర్తి ముందు ఆయన వాదనలు వినిపిస్తున్నాడు. ఈ క్రమంలో కోర్టు హాల్లోనే ఒక్కసారిగా కుప్పకూలారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను చనిపోయారని వైద్యులు వెల్లడించారు. లాయర్ మృతితో మిగతా కోర్టు హాళ్లలో రెగ్యులర్ పిటిషన్లను వాయిదా వేశారు.



జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మహాకుంభమేళలో పాల్గొన్నారు. యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమంలో జరుగుతున్న మహాకుంభమేళలో పుణ్యస్నానాలు ఆచరించారు. త్రివేణి సంగమంలో తన సతీమణి అనాలెజ్నోవా కొణిదెల, తనయుడు అకీరా నందన్, అతడి స్నేహితుడు, ప్రముఖ దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో కలిసి పవన్ కల్యాణ్ మహాకుంభమేళలో పుణ్యస్నానాలు చేశారు. బలగం టీవీ, లక్నో

# కుంభమేళాలో 55 కోట్ల మంది భక్తుల పుణ్యస్నానాలు

- **ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటన**

**బలగం టీవీ, లక్నో**

మంగళవారం సాయంత్రం నాటికి ప్రయాగ్‌రాజ్ కుంభమేళాలో 55 కోట్ల భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. ప్రయాగ్‌రాజ్‌లో వైభవంగా కొనసాగుతోన్న కుంభమేళాకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తున్నారు. మానవ చరిత్రలో ఏ మతపరమైన, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమంలో ఇంత భారీగా జనం పాల్గొనలేదని యూపీ ప్రభుత్వం తెలిపింది. దేశ విదేశాల నుంచి పెద్ద ఎత్తున సామాన్యులు, ప్రముఖులు తరలి వచ్చి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నట్లు తెలిపింది.



దేశంలోని 110 కోట్ల మంది సనాతనుల్లో దాదాపు సగం మంది పవిత్ర గంగానదిలో స్నానమాచరించారని తెలిపింది. ఈ రోజు సాయంత్రానికి 55 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానమాచరించారని, ఫిబ్రవరి 26 నాటికి ఈ సంఖ్య 60 కోట్లు దాటే అవకాశముందని అంచనా వేశారు. ఫిబ్రవరి 14 నాటికే 50 కోట్ల మార్కును అధిగమించి ఈరోజు 55 కోట్లకు చేరుకుంది. జనవరి 29న మౌని అమావాస్య రోజు దాదాపు 8 కోట్ల మంది ప్రయాగ్‌రాజ్‌కు వచ్చారు.

# 420 పాలనలో 430 మంది రైతులు ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి)

తులం బంగారం ఇవ్వలేదు. ఆడబిడ్డలకు 2,500 రూపాయలు కూడా ఇవ్వలేదు. సొంత నియోజకవర్గంలో ఒక్క పని చేయలేదు. పుట్టి పెరిగిన పిల్లనిచ్చిన కల్వకుర్తి ప్రాంతానికి కూడా ఒక్క రూపాయి పని చేయలేదు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఒక రాజు లాగా రైతు ఎవరి దగ్గర చేయి చాపకుండా బ్రహ్మాండంగా బతికిండు. పదేళ్లు మోటార్లు కాలలేదు.. ట్రాన్స్ఫార్మర్లు పేలలేదు. పదేళ్ల రైతులు ఎవరి దగ్గర అప్పులు అడిగే పరిస్థితి లేకుండే. నాట్లేసే టైం కి టింగు టింగు మని రైతుబంధు పైసలు పడుతుండే. టకీ టకీ మని రైతు భరోసా ఇస్తనని రేవంత్ రెడ్డి గప్పాల్ కొట్టిండు. కానీ రూపాయి కూడా ఇవ్వలేదు. కసీఆర్ కంటే ఎక్కువగా రైతు భరోసా రూ. 15,000 ఇస్తానని రేవంత్ రెడ్డి చెప్పిండు కానీ 10 శాతం మంది రైతులకు కూడా ఇవ్వలేదు. సోనియా జన్మదినం సందర్భంగా రుణమాఫీ ఒకేసారి రెండు లక్షలు చేస్తానని చెప్పిండు. కానీ ఇప్పటివరకు చారాణా రుణమాఫీ కూడా చేయలేదు. 500 బోనస్ 10% మంది కూడా పడలేదు. ఆడబిడ్డలకు అరచేతిలో స్వర్గం చూపించిండు. పిల్లనిచ్చిన అత్తగారి ప్రాంతంలోనీ ఆడబిడ్డలకు రేవంత్ రెడ్డి ప్రతినెలా 2500 రూపాయలు ఇస్తున్నాడేమో అనుకున్నా. అయితే అత్తగారి ప్రాంతాన్ని కూడా మోసం చేసిండు. ఈ 14 -15 నెలలు 35 సార్లు ఢిల్లీకి చెక్కర్లు కొట్టడంతోనే రేవంత్ రెడ్డికి సరిపోయింది. కానీ ఢిల్లీ నుంచి 35 పైసలు కూడా తేలేదు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రివర్స్ మైగ్రేషన్ తో వేరే రాష్ట్రాల కూలీలు పాలమూరుకు వచ్చి పనిచేసేవారు. మొన్న తలుపులు ఎత్తుకుపోయిండు. నిన్న స్టార్టర్లు ఎత్తుకుపోయిండు. ఇక రేపు మీ పుస్తెలతాడు కూడా రేవంత్ రెడ్డి ఎత్తుకుపోతడు.

రేవంత్ రెడ్డి దొంగ అని ఎలక్షన్ల ముందు చెప్పినం. తెలంగాణ మొత్తం ఇప్పుడు రేవంత్ రెడ్డి మోసాన్ని తెలుసుకుంది. రైతుకు కులం లేదు మతం లేదు. 70 లక్షల మంది రైతులను కేసీఆర్ గారు పదేళ్లు కడుపులో పెట్టుకొని చూసుకున్నారు. రూ. 73,000 కోట్ల రూపాయల రైతుబంధు పైసలు రైతుల ఖాతాల్లో వేసిన మొట్టమొదటి ముఖ్యమంత్రి ఈ భారత దేశంలో కేసీఆర్ ఒక్కరే. స్వతంత్ర భారతదేశ చరిత్రలో రైతు చనిపోతే అతని కుటుంబానికి 5 లక్షల భీమా ఇచ్చిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్..మేనమామ లెక్క ఆడబిడ్డ పెండ్లికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పేరుతో లక్ష రూపాయలు ఇచ్చిండు. 200 రూపాయల పెన్షన్ ను పదిరెట్లు పెంచి 2000 రూపాయలు చేసిండు కేసీఆర్. ఒవంత్ రెడ్డి నిజాయితీగల మోసగాడు. 42% రిజర్వేషన్ల పేరుతో బీసీలను రేవంత్ రెడ్డి మోసం చేసిండు. రైతు భరోసా 15,000 ఇస్తానని అన్నదాతలను మోసం చేసిండు. రూ. 12,000 ఇస్తానని రైతు కూలీలను మోసం చేసిండు

నెలకు 2,500 ఇస్తానని ఆడబిడ్డలను మోసం చేసిండు చదువుకునే ఆడపిల్లలకు స్కూటీలు ఇస్తానన్నాడు. లగ్గం చేసుకుంటే తులం బంగారం ఇస్తా అనీ వాళ్లను మోసం చేసిండు. ఇలా తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను రేవంత్ రెడ్డి విజయవంతంగా మోసం చేస్తూనే ఉన్నాడు. కాంగ్రెస్ 420 పాలనలో 430 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.

గురుకుల పాఠశాలలను నడపడం చేతకాని సన్నాసి రేవంత్ రెడ్డి. ఇప్పటికి 56 మంది గురుకుల విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం విషాదకరం. కాంగ్రెస్ దరిద్రపు పాలనలో ఏ ఒక్క వర్గం కూడా సంతోషంగా లేదు. ఎన్నికలకు ముందు కెసిఆర్ రైతుబంధు కోసం ఉంచిన పైసల్నే రేవంత్ రెడ్డి వేసిండు అంతేకానీ ముఖ్యమంత్రి అయ్యాక ఒక్క రూపాయి కూడా రైతు భరోసా కింద ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఒక్కో ఎకరానికి 17500 రేవంత్ రెడ్డి బాకీ ఉన్నాడు.

స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారం కోసం ఇంటికి వచ్చే కాంగ్రెస్ నాయకుల గల్లాలు పట్టుకొని తెలంగాణ ప్రజలు నిలదీయాలి. ఎన్నికల తర్వాత దాదాపు 1000 ఎకరాల భూమిని రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు సంపాదించిండ్రు. ఆ భూముల రేట్లు పెంచుకోవడానికి ఇప్పుడు కొత్తగా పెద్ద రోడ్డు వేయాలని ప్లాన్ చేస్తున్నాడు. రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ గురించి తప్ప స్టేట్ గురించి ఫికర్ లేదు. 600 కోట్ల రూపాయలు ఇస్తే సర్పంచుల పెండింగ్ బిల్లుల సమస్య పరిష్కారం అవుతుంది. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను వంచిస్తున్న రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పే పని కల్వకుర్తి ప్రాంతం నుంచే మొదలుపెట్టాలి.

# నేడు బీఆర్ఎస్ కీలక సమావేశం



**బలగం టీవీ, హైదరాబాద్**

బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన బుధవారం పార్టీ కీలక సమావేశం జరగనున్నది. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులే కాకుండా ఇతర రాజకీయ పార్టీలు ఈ సమావేశంపై ఆసక్తితో ఎదురుచూస్తున్నాయి. 2001 ఏప్రిల్ 27న ఆవిర్భవించిన బీఆర్ఎస్ పార్టీ 25వ వసంతంలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణభవన్‌లో మధ్నాహ్నం రాష్ట్ర కార్యవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు సమావేశానికి హాజరుకానున్నారు. బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏండ్లు కావస్తున్న నేపథ్యంలో పార్టీ సిల్వ ర్ జూబ్లీ వేడుకల నిర్వహణతోపాటు సభ్యత్వ నమోదు, పార్టీ నిర్మాణం తదితర నిర్మాణాత్మక అంశాలపై విస్తృతస్థాయిలో చర్చించనున్నట్టు వర్కింగ్ ప్రెసిడెం ట్ కేటీఆర్ ఇప్పటికే ప్రకటించారు.

ఈ నెలాఖరులో బహిరంగ సభ నిర్వహించాలని పార్టీ నాయకత్వం మొదట నిర్ణయించింది. అయితే, బహిరంగసభను ఈ నెలలో నిర్వహించడం కన్నా పార్టీ ఆవిర్భావ దినోత్సవంనాడు నిర్వహించాలా? లేదా పార్టీ అధ్య క్ష ఎన్నిక ఉన్న సెప్టెంబర్/అక్టోబర్‌లో నిర్వహించా లా? అనే అంశంపై చర్చించనున్నట్టు సమాచారం. ఏప్రిల్ 27న ప్రతినిధుల సభను నిర్వహించి, అప్పటినుంచి అధ్యక్ష ఎన్నిక నాటికి పార్టీ సభ్యత్వ నమో దు, గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి దాకా పార్టీ ప్రధాన కమిటీలు, అనుబంధ కమిటీల ఎన్నికల ని ర్వహణ, సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో అధ్యక్ష ఎన్నిక నిర్వహణ తదితర అంశాలపై లోతుగా చర్చించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పార్టీ చేపట్టాల్సిన కార్యాచరణ, అనుసరించే వ్యూహంపై పార్టీ శ్రేణులకు అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

# భూ భారతి స్ఫూర్తితోనే విధి విధానాలు

(మొదటి పేజీ తరువాయి)

తీసుకురాబోతుంది.భూ హక్కులను రక్షించడం, భూ వ్యవహారాలలో పారదర్శకత తీసుకురావడం భూ లావాదేవీలను సులభ తరం చేయడం, సామాన్యులకు సైతం రెవెన్యూ సేవలను అందుబాటులోకి తీసుకురావడం ఈ చట్టం ప్రధాన లక్ష్యం. ఈ చట్టం తరతరాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతుంది.

భవిష్యత్తులో మరింత మెరుగైన విధానాలు, సాంకేతికతను ఉపయోగించుకొని భూ పరిపాలనను మరింత సమర్ధవంతంగా కొనసాగిస్తాం ఈ నూతన చట్టం ద్వారా భూ యాజమాన్య హక్కులనే గాకుండా వారి జీవితాలను ఆత్మగౌరవాన్ని ఆర్ధిక స్వతంత్ర్యాన్ని తీసుకువస్తుంది" అని అన్నారు.ఈ సమావేశంలో రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, సిసిఎల్ఏ పీడీ సిఎంఆర్ఓ శ్రీ మకరంద్, భూ చట్ట నిపుణులు శ్రీ భూమి సునిల్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్గిరి, వికారాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల కలెక్టర్లు వివిధ జిల్లాల ఆర్‌డిఓలు, తహసీల్దార్లు, రిటైర్డ్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# సోలార్ పెన్సింగ్ స్కీంను ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం

**- పామాయిల్ తో పాటు ఇతర పంటలకు డ్రిప్ మరియు తుంపర సేద్య పరికరాలను అవసరం మేరకు రైతులకు అందించాలని ఆదేశాలు**

**- రాష్ట్ర అవసరాలు తీర్చే విధంగా కూరగాయల సాగు పెంపునకు పెరి అర్బన్ క్లస్టర్లను ఏర్పాటుచేయాల్సిందిగా ఆదేశాలు**

**- జూన్ మొదటి వారంలోపు రాష్ట్రంలో మరో ఆయిల్ పామ్ కర్మాగారం అందుబాటులోకి, మరో రెండు ఫ్యాక్టరీల నిర్మాణ పనులు ఆరంభించేలా చర్యలు**

**- మెకడమియా పంట సాగుకు అవసరమైన పరిస్థితులను, అనువైన ప్రాంతాలను అధ్యయనం చేయాల్సిందిగా ఉద్యానశాఖ అధికారులకు ఆదేశాలు**

**-ప్రగతి చూపని ఆయిల్ పామ్ కంపెనీలపై చర్యలు ఆరంభం, ఇప్పటికే విశ్వతేజ ఆయిల్ పామ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులు రద్దు**

**- మంత్రి తుమ్మల**

బలగం టీవీ, హైదరాబాద్

సచివాలయంలో ఉద్యానశాఖ అధికారులతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్షా సమావేశం నిర్వహించినారు. ఈ సందర్భంగా మంత్రిమాట్లాడుతూ, కోతులు మరియు ఇతర అడవి జంతువుల వల్ల ఇబ్బంది ఉన్న అన్ని జిల్లాలలో ఉద్యాన పంటల రక్షణకు సోలార్ పెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు వీలుగా సోలార్ పెన్సింగ్ స్కీం అమలవుతున్న హిమాచల్ ప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో పర్యటించి, రాష్ట్ర ప్రభుత్వం తరపున సబ్సిడీపై అందచేయుటకు విధివిధానాలు వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల కూరగాయలు మరియు ఉద్యాన పంటల సాగు చేయడానికి రైతులు ముందుకు రావడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు.

హైదరాబాద్ నగరానికి 100 కిలోమీటర్ల పరిధిలోపు ఉన్న అన్ని ప్రాంతాలలో కూరగాయాల సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందుకోసం పెరి అర్బన్ క్లస్టర్లను ఏర్పాటుచేసి, రైతులకు ప్రోత్సహకాలు కూడా అందించేలా చూడాలన్నారు. కూరగాయల సాగు కోసం అవసరం మేరకు యంత్ర పరికరాలు సబ్సిడిపై అందించి, సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్నారు. రాబోయే రెండు, మూడు సంవత్సరాలలో కూరగాయల పంటలను పెద్ద ఎత్తున ఉత్పత్తిచేసి, కూరగాయలను దిగుమతి చేసుకొనే స్థితి నుండి ఎగుమతి చేసే స్థితికి తీసుకురావాలని మంత్రిగారు తెలియజేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరం సంబంధించి కూడా ముందస్తుగా డ్రిప్ మరియు స్ప్రింక్లర్ల పంపిణీ కోసం ధరఖాస్తులను స్వీకరించి, గ్రౌండింగ్ మొదలు పెట్టాల్సిందిగా ఆదేశించారు. ఇతర రాష్ట్రాలలో సాగు చేస్తు లాభాలు పొందుతున్న మెకడమియా పంటను రాష్ట్రంలో ప్రవేశపెట్టడానికి గల వాతావరణ స్థితిగతులు, నేలలు, నర్సరీలు, మార్కెటింగ్ అవకాశాలను అధ్యయనం చేయాలని ఉద్యానశాఖ అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు.

మార్చి నెలాఖరు కల్లా ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకునేలా చర్యలు తీసుకోవాలని, తక్కువ పురోగతి ఉన్న కంపెనీలకు నోటిసులు జారీ చేసి, ఏఏ జిల్లాలలో తక్కువ పురోగతి ఉందో వాటికి అనుమతులు రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయిల్ పామ్ చట్టంలో ఉన్న నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇప్పటికే విశ్వతేజ ఆయిల్ పామ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేసి మల్టి నేషనల్ కంపెనీ అయిన హిందుస్థాన్ యూనిలివర్ లిమిటెడ్ కంపెనీకి సదరు ప్రాంతాన్ని అప్పగించడం జరిగిందని, అలాగే ఇంకా ఎక్కడైతే కంపెనీలు మూడు, నాలుగు సంవత్సరాలు అయినప్పటికి ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణానికి భూమి గుర్తించక పోవడం, ప్లాంటేషన్ లక్ష్యాన్ని చేరుకోని కంపెనీలను తొలగించి, వాటి స్థానంలో ఆయిల్ ఫెడ్ కు బాధ్యతలు అప్పగించడం జరుగుతుందని తెలియజేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆయిల్ పామ్ సాగు కోసం రెండు లక్షల ఎకరాలను లక్ష్యంగా పెట్టుకొని పనిచేయాలని ఆదేశించారు. ఆయిల్ ఫెడ్ సిబ్బందికి కూడా లక్ష్యాలు నిర్దేశించి వాటిని చేరుకొనే విధంగా పనిచేసేటట్లు చూడాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రైవేట్ కంపెనీలు కూడా లక్ష్యానికి అనుగుణంగా ప్లాంటేషన్ పూర్తి చేసేట్టుగా, ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పర్యవేక్షణ చేయాలని ఉద్యానశాఖ డైరెక్టర్ గారికి సూచించారు.

వచ్చే సంవత్సరం చివరికల్లా ఉమ్మడి జిల్లాలలో కనీసం ఒక పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగేలా చూడాలని, పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కనీసం సంబంధింత జిల్లాలలో 6 వేల ఎకరాలకు పైన ప్లాంటేషన్ ఉండేట్టుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టిఎస్ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా నర్మెట్ట గ్రామంలో నిర్మాణం జరుగుతున్న ఆయిల్ పామ్ కర్మాగారాన్ని మే నెలాఖరుకల్లా పూర్తి చేయాలని, అదేవిధంగా గద్వాల జిల్లా బీచుపల్లిలో, ఖమ్మం జిల్లా కల్లూరిగూడంలో ఆయిల్ పామ్ కర్మాగారాల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియను వెంటనే పూర్తిచేసి, పనులు ప్రారంభించి, ఈ డిసెంబర్ కల్లా వాటి నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా 6 వేల ఎకరాలపైన ప్లాంటేషన్ పూర్తి చేసిన ప్రైవేట్ కంపెనీలు కూడా వెంటనే పామ్ ఆయిల్ కర్మాగారాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ రఘునందన్ రావుగారు, హార్టికల్చర్ డైరెక్టర్ శ్రీమతి యాస్మిన్ బాషా గారు, ఆయిల్ ఫెడ్ అధికారులు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

### సీఎం రేవంత్ రెడ్డికి

## మహాశివరాత్రి ఆహ్వాన పత్రిక అందజేసిన ప్రభుత్వ విప్..



**-ముఖ్యమంత్రికి రాజన్న ప్రసాదం,ఆశీర్వచనం అందజేసిన అర్చకులు**

**బలగం టీవీ , వేములవాడ**

తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 25 నుంచి 27 వరకు ఎంతో వైభవోపేతంగా నిర్వహించే మహా శివరాత్రి జాతర వేడుకలకు రావాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు,పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి,ముఖ్యమంత్రి సలహదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ, ఎమ్మెల్యే లకు రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్,ఆలయ అర్చకులు, అధికారులు మహాశివరాత్రి ఆహ్వాన పత్రికను మంగళవారం అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి రాజన్న ప్రసాదం అందజేసి వేదో ఆశీర్వచనం అందజేశారు..

**ఆలయ విస్తరణ పనులపై సీఎం ఆరా**

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీయగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పనులు టెండర్ దశలో ఉన్నాయని వివరించారు..ఈ సందర్భంగా గత ప్రభుత్వంలో లాగా పనుల్లో జాప్యం చేయకుండా ఆలయం విస్తరణ పనులను వేగవంతం చేయాలని, రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు మెరుగైన దర్శనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు..

వేములవాడ ప్రజలు రాజన్న భక్తులు ఎంత కాలం నుంచి ఎదురు చూస్తున్నా రోడ్డు వెడల్పుకు సంబంధించి భూ సేకరణ కోసం నిధులు విడుదల చేయాలని సంబంధిత అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు..

**మహాశివరాత్రికి ఘనంగా ఏర్పాట్లు చేయాలి..**

మహాశివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. భక్తులకు శీఘ్ర దర్శనం, క్యూలైన్లలో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా తాగునీటి వసతి, చలువ పందిళ్ళు తదితర ఏర్పాట్లు ముమ్మరం చేసి రాజన్న భక్తులకు మెరుగైన వసతులు కల్పించి మహాశివరాత్రి జాతర ఘనంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.. ఈ కార్యక్రమంలో ఈవో కే వినోద్, ఏ ఈ ఓ బ్రహ్మన్న గారి శ్రీనివాస్, అర్చకులు చంద్రగిరి శరత్, గోపన్న గారి చందు, మామిడిపల్లి శరత్,వెంకన్న తదితరులు ఉన్నారు..

## కులగణన రీసర్వేలో కేటీఆర్ పాల్గొనాలి...



**-బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు**

**బలగం టీవీ , సిరిసిల్ల**

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న కులగనన రిసర్వే లో మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొనాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు కోరారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీసీ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ గతంలో విద్యా, ఉద్యోగ ,ఆర్థిక ,రాజకీయ ,కులగణలో మాజీ మంత్రి కేటీఆర్ పాల్గొనలేదని అపవాదు ఉన్నదని ,అట్టి అపవాదు ను తొలగించుకునేందుకు కేటీఆర్ కు రీ సర్వే మంచి అవకాశం అని అన్నారు.కేటీఆర్ రీ సర్వే లో పాల్గొని వివరాలను నమోదు చేసుకొని సామాజిక మాధ్యమాలకు విడుదల చేయాలన్నారు.అసెంబ్లీలో జరిగిన బీసీ కులగణన పై జరిగిన చర్చలో కేటీఆర్ మాట్లాడుతూ బీసీ కులగణన తప్పులతడకగా ఉన్నదని పూర్తిగా జరగలేదని తూతూ మంత్రంగా ఈ సర్వే చేసి ఏదో తీర్మానం చేసి కేంద్రానికి పంపి కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తుందని అన్నారు.ఈ సర్వే వాళ్ళ బీసీలు నష్టపోతారని బీసీ బిల్లు పెట్టి అసెంబ్లీలో చట్టం తేవాలని డిమాండ్ చేసినారని, ఆ విధంగా బీసీల పక్షాన మాట్లాడినందుకు మాజీ మంత్రి కేటీఆర్ కు బీసీ సంఘాల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు.అదే చిత్తశుద్ధిని రి సర్వే లో పాల్గొని నిరూపించుకోవాలని ఈ సందర్భంగా కేటీఆర్ కు విజ్ఞప్తి చేశారు,తెలంగాణ ప్రభుత్వం రిసర్వే చేస్తున్న సందర్భంగా కులగణలో గతంలో ఎవరైతే నమోదు చేసుకోలేదో వాళ్ళందరూ పీబ్రవరి 16 నుండి 28 వరకు తమ వివరాలను నమోదు చేసుకొని విజయవంతం చేయాలని అన్నారు. రాష్ట్రంలో మొదటిసారి చేసిన కులగనన పైన మా బీసీ సంక్షేమ సంఘం ,బీసీ కుల సంఘాలు మరియు అన్ని ప్రతిపక్ష రాజకీయ పార్టీలు కులగననా సరిగా చేయలేదని తప్పులతడక అనీ పునసమీక్షించి రి సర్వే చేయాలని అనేకమైన నిరసన కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వ%శీ% పై డిమాండ్ చేశామన్నారు.మా సంఘాల విజ్ఞప్తి మరియు రాజకీయ పార్టీల ఒత్తిడి మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బే శాజాలం కు పోకుండా రీ సర్వే కు ఆదేశించారన్నారని అన్నారు.రి సర్వేకు ఆదేశించడం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి రేవంత్ రెడ్డికి బీసీ సంఘాల పక్షాన ధన్యవాదాలు తెలిపారు,మొదటిసారి కులగనన తర్వాత రాజకీయ పార్టీల , బీసీ సంఘాల విజ్ఞప్తి మేరకు అధికార పార్టీ రిసర్వే చేయడం గొప్ప విషయం అన్నారు. బీసీ బిల్లు పెట్టి చట్టం చేస్తే బీసీలకు వచ్చే స్థానిక సంస్థ ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు అమలు కు అవకాశం ఏర్పడుతది అనీ,అందుకు అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ తో పాటు బీ జే పీ,ఎంఐఎం సిపిఐ ల మద్దతు ఇవ్వాలని సందర్భంగా డిమాండ్ చేశారు.అసెంబ్లీలో చేసిన తీర్మానం గాని చట్టాన్ని గాని కేంద్రమునకు పంపితే అక్కడ పార్లమెంటులో పెట్టి రాజ్యాంగ సవరణ చేసి ఈ బిల్లును చట్టబద్ధత కల్పించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం,బిజెపి పార్టీ పైన ఉన్నదని అన్నారు, 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు అమలు అయ్యే విధంగా చేసే రాజకీయ పార్టీకే భవిష్యత్తులో మా మద్దతు ఉంటుందని సహకరించక వ్యతిరేకించే రాజకీయ పార్టీలను ఎండగడతామని అన్నారు.ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరవేణి మల్లేశ్ యాదవ్,పట్టణ అధ్యక్షుడు తడిక కమలాకర్,జిల్లా నాయకులు తోట్ల రాములు,తిరుపతి,బచ్చు ప్రసాద్ ,రవి,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మడేలేశ్వర స్వామి ఆలయ మెట్లు కూల్చేసిన గుర్తుతెలియని వ్యక్తులు



**- పోలీసులకు ఫిర్యాదు చేసిన జిల్లా అధ్యక్షుడు**

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమల గ్రామంలో మా కుల దైవం అయినటువంటి మడేలేశ్వర స్వామి ఆలయ మెట్లును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారని జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేష్ తో పాటు కుల సంఘ సభ్యులు ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... ప్రతి కులానికి మేము మా వృత్తిని చేసుకుంటూ మీ ఇంటికి ఆడబిడ్డలా ఉండే మేము మా కులదైవం అయినటువంటి మడేలేశ్వర స్వామి ఆలయ మెట్లు ధ్వంసం పట్ల బాధాకరమని అన్నారు. మీకు ఏమైనా వ్యక్తిగతంగా ఉన్న లేక మీ భూమి మా ఆలయానికి ఏమైనా సంబంధం ఉంటే నేరుగా మా ముందుకు వచ్చి మాట్లాడాలి తప్ప ఇలా ఆలయ మెట్లను ధ్వంసం చేసి కులమతాల మధ్య చిచ్చు రేపొద్దు అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బాలమల్లు, కాంగ్రెస్ పార్టీ మూడు మండలలా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొమ్మటి నర్సయ్య,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, రజక సంఘం మండల అధ్యక్షులు కంచర్ల నరసింహులు, గ్రామ శాఖ అధ్యక్షుడు రజక సంఘం కుల పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



## ప్రమాదకరంగా ఉన్న గుంతలు పూడ్చిన పత్రిక మిత్రులు

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**

కామారెడ్డి సిరిసిల్ల ప్రధాన రహదారిపై అయినటువంటి ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ శివారులోని బ్రిడ్జికి ఆనుకొని ఉన్న ప్రమాదకరమైన గుంతను ఎల్లారెడ్డిపేట మండల పత్రిక మిత్రులు పూడ్చివేసి ప్రమాదాలు జరగకుండా మరమ్మతులు చేశారు. మండల ప్రెస్ క్లబ్ సభ్యులు కంకర, సిమెంట్,ఇసుక కలిపి గుంతను పూడ్చివేశారు. ఇప్పటివరకు రోజు పదుల సంఖ్యలో వాహనదారులు గుంతలో పడి ఎందరో తీవ్ర గాయాలు అయ్యారని అన్నారు. పలుమార్లు పత్రికలో వచ్చిన వార్తకు కూడా ఆర్ అండ్ బి అధికారులు కనీసం స్పందన కూడా ఇవ్వకపోవడం విడ్డూరమన్నారు. ఇంకా ఎన్నో ప్రదేశాల్లో భారీ గుంతలు ఏర్పడి రోడ్లపై వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా ఆర్ అండ్ బీస్ అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరారు. వీరిని స్థానికులు, ప్రజా ప్రతినిధులు, వాహనదారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పత్రిక మిత్రులు పాల్గొన్నారు.

## హైడ్రా తవ్వకాల్లో బయటపడిన బతుకమ్మకుంట

**నవతెలంగాణ-సిటీబ్యూరో**

బతుకమ్మ కుంట బతికే ఉంది. మోకాలు లోతు మట్టి తీయగానే బిరబిరా గంగమ్మ బయటకొచ్చింది. ఇక అంతే అక్కడి స్థానికులలో ఆనందం పెల్లుబికింది. బతుకమ్మ కుంట కాదు.. ఇది మా స్థలమంటూ ఇప్పటివరకూ నమ్మబలికిన వారు ఇప్పుడేమంటారు అని అక్కడి స్థానికులు ప్రశ్నిస్తున్నారు.కబ్జాల చెరలో చెరువు ఆనవాళ్లను కోల్పోయిన చెరువుకు ప్రాణం పోయమని స్థానికులు హైడ్రాను ఆశ్రయించిన విషయం విధితమే. ఈ మేరకు అక్కడి ముల్ల పొదలను తొలగించి తవ్వకాలు చేపట్టిన హైడ్రాకు నీరు స్వాగతం పలికింది. మంగళవారం మోకాలులోతు మట్టిని తీయగానే నీరు ఉబికి వచ్చింది. దశాబ్దాలుగా నింపిన మట్టిని మొత్తం తొలగిస్తే చెరువు కళకళలాడుతుందని స్థానికులు చెబుతున్నారు. అయితే బతుకమ్మ కుంట స్థలం తనదంటూ స్థానిక నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా, కింది కోర్టుకు వెళ్లాలని సూచించిన విషయం విధితమే. నాటి నుంచి పనులను హైడ్రా కొనసాగించింది.

బాగ్ అంబర్‌పేటలోని బతుకమ్మ కుంట ఉంది. అంబర్‌పేట మండలం, బాగ్అంబర్‌పేట్‌లోని సర్వే నంబరు 563లో 1962 -63 లెక్కల ప్రకారం మొత్తం 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మ కుంట ఉండేది. బఫర్ జోన్‌తో కలిపి మొత్తం వైశాల్యం 16.13 ఎకరాల విస్తీర్ణమని సర్వే అధికారులు తేల్చారు. తాజా సర్వే ప్రకారం అక్కడ మిగిలిన భూమి కేవలం 5.15 ఎకరాల విస్తీర్ణం మాత్రమే ఉంది. ప్రస్తుతతం మిగిలి ఉన్న 5.15 ఎకరాల విస్తీర్ణంలోనే బతుకమ్మ కుంటను పునరుద్ధరించేందుకు హైడ్రా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం అక్కడ నివాసం ఉంటున్న వారికి ఎలాంటి ముప్పు లేకుండా చెరువు తవ్వకానికి హైడ్రా కమిషనర్ ఐజీ ఏవీ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. ఒకప్పటి ఎర్రకుంటనే కాలక్రమంలో బతుకమ్మ కుంటగా మారిందన్న స్థానికులు అభిప్రాయడ్డారు. రెవెన్యూ రికార్డులు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి. కాలక్రమంలో బతుకమ్మకుంటలో చెత్త, నిర్మాణ వ్యర్థాలు పోయడంతో చెరువు ఆనవాళ్లు కోల్పోయిందన్న స్థానికులు హైడ్రా దృష్టికి తీసుకొచ్చారు.



# క్రికెటర్లు ఫ్యామిలీని తీసుకెళ్లొచ్చు..!

**బలగం టీవి, హైదరాబాద్**

ఛాంపియన్స్ ట్రోఫీ కోసం టీమ్ ఇండియా ఆటగాళ్లు దుబాయ్ చేరుకున్న విషయం తెలిసిందే. ఈ టూర్‌లో ఆటగాళ్లకు బీసీసీఐ పది షరతులు పెట్టింది. ఈ మేరకు ఆటగాళ్లు కనీసం 45 రోజులు, అంతకంటే ఎక్కువ రోజులు విదేశాలకు వెళ్తేనే.. జట్టులోని సభ్యులతో వారి ఫ్యామిలీలు గరిష్టంగా రెండు వారాల పాటు ఉండేందుకు అనుమతి ఉంటుంది. అయితే, దుబాయ్ పర్యటనకు మాత్రం ఫ్యామిలీని అనుమతించలేదని వార్తలు వచ్చాయి. అయితే, తాజాగా ఈ విషయంలో బీసీసీఐ యూటర్న్ తీసుకున్నట్లు తెలిసింది. ఛాంపియన్స్ ట్రోఫీలో క్రికెటర్ల కుటుంబ సభ్యులను తీసుకెళ్లేందుకు అనుమతించినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. అయితే, ఓ షరతు పెట్టినట్టు పేర్కొన్నాయి. ట్రోఫీ మొత్తంలో ఏదైనా ఒక మ్యాచ్ కోసం మాత్రమే కుటుంబసభ్యులను అనుమితిస్తారట. ఈ విషయంలో ఆటగాళ్లు చర్చించుకుని బీసీసీఐకి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఆటగాళ్ల అభ్యర్థన మేరకు బీసీసీఐ అందుకు తగిన ఏర్పాటు చేస్తుందని క్రికెట్ వర్గాలు వెల్లడించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి.

# జెండా వివాదంపై స్పందించిన బీసీసీఐ

**బలగం టీవి, హైదరాబాద్**



ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ప్రారంభానికి ముందు చోటు చేసుకున్న జెండా వివాదంపై బీసీసీఐ స్పందించింది. పీసీబీ తీరును తప్పుబట్టింది. మిగతా జట్ల తరహాలోనే భారత జెండాను కూడా ఎగరవేయాలని బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా డిమాండ్ చేశారు. ఛాంపియన్స్ టోర్నీలో పాల్గొంటున్న దేశాల జెండాలను కరాచీ స్టేడియంతో పాటు లాహోర్‌లోని గడాఫీ స్టేడియం పైకప్పుపై ఎగరవేసిన పీసీబీ.. భారత త్రివర్ణ పతకాన్ని మాత్రం విస్మరించింది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో భారత అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే పీసీబీ స్పందిస్తూ.. 'ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లు ఆడేందుకు పాకిస్థాన్‌కు భారత్ రావట్లేదు. కరాచీ, రావల్పిండి, లాహోర్ స్టేడియాల్లో మ్యాచ్‌లు ఆడుతున్న జట్ల జెండాలను మాత్రమే ఎగరవేశాం. భారత్ తన మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడనుంది. బంగ్లాదేశ్ కూడా ఇంకా పాకిస్థాన్‌కు రాలేదు. ఆ జట్టు తమ తొలి మ్యాచ్‌ను భారత్‌తో ఆడనుంది. కాబట్టి భారత్, బంగ్లాదేశ్ జెండాలను ఇంకా ఎగరవేయలేదు. పాకిస్థాన్‌కు వచ్చిన మిగతా జట్ల జాతీయ పతకాలను మాత్రమే ఎగరవేసాం. ఈ జెండాల గురించి పీసీబీ అధికారికంగా స్పందించాల్సిన అవసరం లేదు.'అని ఆ బోర్డు వర్గాలు మీడియాకు తెలిపాయి.

అయితే ఈ వ్యవహారంపై తాజాగా ఓ జాతీయ ఛానెల్‌తో మాట్లాడిన రాజీవ్ శుక్లా.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీరును తప్పుబట్టారు. 'ముందుగా అక్కడ భారత జెండా ఉందో లేదో నిర్ధారించుకోవాలి. ఒకవేళ లేకుంటే మాత్రం భారత జెండా పెట్టాల్సిందే. ఈ టోర్నీలో పాల్గొనే అన్ని జట్ల జాతీయ పతకాలను ఎగరవేయాలి.'అని రాజీవ్ శుక్లా తెలిపారు.



# 'ఛావా' మేకింగ్ వీడియో విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**

బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో వచ్చిన తాజా చిత్రం ఛావా . రష్మిక మందన్నా హీరోయిన్‌గా నటించగా.. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించాడు. ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్ టాక్‌తో దూసుకెళుతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ఛావా మేకింగ్ వీడియోను విడుదల చేసింది. ఈ వీడియోలో ఛత్రపతి శంభాజీ మహరాజ్ పాత్ర కోసం విక్కీ ఎలా కష్టపడ్డాడో మేకర్స్ చూపించారు. ఈ సినిమా కోసం దాదాపు 6 నెలల పాటు శిక్షణ తీసుకున్నట్లు విక్కీ వెల్లడించాడు. ఈ శిక్షణలో భాగంగా గుర్రపు స్వారీ, యుద్ధంలో కత్తితో పాటు డాలు, చాకు, బల్లెం ఎలా ఉపయోగించాలో శిక్షణ తీసుకున్నాడు. అలాగే శంభాజీ మహారాజ్‌గా ధృఢమైన శరీరంతో కనిపించేందుకు కండలు పెంచడమే కాకుండా 100 కిలోల బరువు పెరిగినట్లు తెలిపాడు. కాగా ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.

# ఛాంపియన్స్ ట్రోఫీ పోరుకు వేళాయె




- నేటి నుంచి చాంపియన్స్ ట్రోఫీ
- మొదటి మ్యాచ్‌లో పాక్, కివీస్ ఢీ
- రేపు బంగ్లాదేశ్‌లో తలపడనున్న భారత్

**బలగం టీవి, హైదరాబాద్**

క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఛాంపియన్స్ ట్రోఫీ నేటి నుంచి ప్రారంభం కానుంది. బుధవారం గ్రాండ్ గా ఈ మెగా టోర్నీ ప్రారంభంకానుంది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య పాకిస్తాన్ న్యూజిలాండ్‌తో తలపడనుంది. కరాచీలోని నేషనల్ స్టేడియం ఈ మ్యాచ్ కు ఆతిధ్యం ఇస్తుంది. ఎనిమిదేళ్ల తర్వాత తొలిసారి ఐసీసీ టోర్నీ జరగనుండడంతో ఈ టోర్నీపై భారీ హైప్ నెలకొంది. డిఫెండింగ్ ఛాంపియన్ గా పాకిస్థాన్ బరిలోకి దిగుతుంది.

ఈ టోర్నీ పాకిస్థాన్, దుబాయ్‌లో హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహిస్తోంది. అంటే పాకిస్థాన్‌తో పాటు కొన్ని మ్యాచ్‌లో దుబాయ్ వేదికగా జరగనున్నాయి. టీమిండియా ఆడే మ్యాచ్‌లన్నీ కూడా దుబాయ్‌లోనే జరగనున్నాయి. భద్రతా కారణాల దృష్ట్యా టీమిండియాను పాకిస్థాన్‌కు పంపేందుకు బీసీసీఐ అంగీకరించకపోవడంతో ఐసీసీ ఈ నిర్ణయం తీసుకుంది.

వన్డే ఫార్మాట్ లో టాప్ 8 జట్లు ఆడే ఈ టోర్నీ ఫిబ్రవరి 19 నుండి మార్చి 9 వరకు జరుగుతుంది. పాకిస్తాన్,దుబాయ్ వేదికలుగా ఈ మెగా టోర్నీ జరగనుంది. పాకిస్థాన్ లోని లాహోర్, కరాచీ, రావల్పిండి ఎనిమిది జట్లు ఆడే ఈ టోర్నమెంట్‌లో మొత్తం 10 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. పాకిస్తాన్,దుబాయ్ వేదికలుగా ఈ మెగా టోర్నీ జరగనుంది. భారత జట్టు పాల్గొనే మ్యాచ్‌లు దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతాయి. భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ గ్రూప్ ఏ లో ఉండగా.. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్ గ్రూప్ బి లో ఉన్నాయి. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత పాకిస్తాన్ ఆతిథ్యం ఇస్తున్న మొదటి ఐసీసీ ఈవెంట్ ఇదే కావడం విశేషం.

ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్ లన్నీ టీవీ ఛానెల్ లో స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. జియో హాట్‌స్టార్‌లోనూ ఈ మ్యాచ్ లు లైవ్ చూడొచ్చు. భారత కాలమాన ప్రకారం మ్యాచ్ లన్ని మధ్యాహ్నం 2:30 గంటలకు ప్రారంభమవుతాయి.

టీమిండియా గ్రూప్ స్టేజ్‌లో అన్ని మ్యాచ్‌లు దుబాయ్‌లో ఆడనుంది. ఈ నెల 20న బంగ్లాదేశ్‌తో భారత జట్టు తలపడనుంది. పాకిస్థాన్‌తో ఫిబ్రవరి 23న, న్యూజిల్యాండ్‌తో మార్చ్ 2న ఆడనుంది. ఈ మూడు మ్యాచ్‌ల్లో కనీసం రెండు గెలిచినా టీమిండియా సెమీస్‌కు చేరుతుంది. మార్చ్ 4వ తేదీన మొదటి సెమీ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. గ్రూప్–బీలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్థాన్ జట్లు ఉన్నాయి. భారత జట్టు సెమీస్‌కు చేరితో వీటిలో ఏదో ఒక టీమ్‌తో సెమీస్‌లో తలపడనుంది. ఇక ఫైనల్ మ్యాచ్ మర్చ్ 9న జరగనుంది. టీమిండియా సెమీ ఫైనల్, ఫైనల్‌కు వరకు వెళ్తే.. ఆ మ్యాచ్‌లు కూడా దుబాయ్‌లోనే జరుగుతాయి.

# పుష్ప 2' ఫైనల్ కలెక్షన్స్ రూ. 1871 కోట్లు

**బలగం టీవి, హైదరాబాద్**

అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప 2 ది రూల్'. సుకుమార్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాలో రష్మిక కథానాయికగా నటించింది. డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించిన విషయం తెలిసిందే. దాదాపు రూ.1800 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి ప్రభాస్ బాహుబలి 2 పేరు మీద ఉన్న అత్యధిక వసుళ్ల రికార్డును అధిగమించింది. తాజాగా ఈ సినిమా ఇప్పటివరకు సాధించిన ఫైనల్ కలెక్షన్స్‌ని చిత్రబృందం తాజాగా వెల్లడించింది. ఈ సినిమా రూ. 1,871 కోట్ల వసూళ్లను రాబట్టినట్లు చిత్రయూనిట్ తెలిపింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. మొదటి రోజే రూ.294 కోట్ల వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం 3 రోజుల్లోనే రూ.500 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. అనంతరం 6 రోజుల్లోనే ఏకంగా రూ.1000 కోట్లు కలెక్షన్లు తీసుకువచ్చింది.







# హోలీ కానుకగా 'దిల్ రూబా'

**బలగం టీవి, హైదరాబాద్**

కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'దిల్ రూబా'. రుక్సర్ ధిల్లాన్ హీరోయిన్. శివమ్ సెల్యులాయిడ్స్, మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకుడు. ఈ సినిమా మార్చి 14న హోలీ పండుగ సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం రామానాయుడు స్టూడియోలో జరిగిన ఈవెంట్‌లో ఈ చిత్రంలోని సెకండ్ సింగిల్ 'హే జింగిలి..'ని రిలీజ్ చేశారు.

# దుబాయ్‌లో 'గామా' అవార్డుల రివీల్ ఈవెంట్

**బలగం టీవి, హైదరాబాద్**

దుబాయ్ , గామా అవార్డ్స్ 2025, 5వ ఎడిషన్ గ్రాండ్ రివీల్ ఈవెంట్ అజ్మాన్, దుబాయ్‌లోని మైత్రి ఫార్మ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ ప్రత్యేకమైన వేడుకకు దుబాయ్‌లోని 500 మందికి పైగా తెలుగువారు హాజరయ్యారు. వీరితో పాటు తెలుగు కళా, సంగీత ప్రపంచానికి చెందిన పలువురు ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొని, గామా ప్రాముఖ్యతను ఉద్ఘాటించారు. మొట్టమొదటి సరిగా, సరికొత్తగా, వినూత్నంగా ఈ గ్రాండ్ రెవీల్ ఈవెంట్ నిర్వహించారు. ఈ వేడుకలో ప్రముఖ గాయకుడు రఘు కుంచె సమక్షంలో ఈవెంట్ డేట్ ను వేదికను అలాగే జ్యూరీ కమిటీని అధికారికంగా ప్రకటించారు.

